నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: 11 కేవీ ఓల్డ్ బాంబే విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీదేవి థియేటర్, ఓల్డ్ బాంబే రోడ్డు, బిచ్చారెడ్డి స్వీట్ షాప్, భెల్ మెయిన్‌రోడ్డు , వేముకుంట ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

◆ 11 కేవీ మార్తాండనగర్ ఫీడర్, 11 కేవీ ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు మార్తాండనగర్, న్యూహఫీజ్‌పేట్, హనీఫ్‌కాలనీ, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక్‌నగర్, ప్రకాశ్‌నగర్, ప్రాంతాల్లో..

◆ 11కేవీ ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యూహఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ మొత్తం ప్రాంతం, ప్రేమ్‌నగర్ బీబ్లాక్ వంటి ప్రాంతాలలో ..

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా డైమండ్ హిల్స్,ఎన్‌టీఆర్ నగర్, ప్రతిమా ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

◆ 11 కేవీ డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, డైమండ్ హైట్స్, జవహర్ నవోదయ స్కూల్ ఏరియా, నల్లగండ్ల హుడా కాలనీ, అపర్ణ మాల్ ఎదురు ప్రాంతాలోలో

◆ 11 కేవీ ఎన్‌టీఆర్ నగర్, ప్రతిమా ఫీడర్‌ల పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, ఎన్‌టీఆర్ నగర్, తాజ్‌నగర్, ప్రతిమా విల్లాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 45, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 35, చిక్కుడు 40, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఎల్ కాలనీలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఉంటుందని ఆలయ నిర్వాహకులు కల్లు నరసింహులుగౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండు రోజులు ప్రత్యేక పూజలు ఉంటాయని, 14 తేదీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, బోనాల సమర్పణ, ఒగ్గు కథ ఉంటుందని తెలిపారు.

నేడు సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని మానసా హిల్స్‌లో గుట్టపై వెలసిన సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర నేపథ్యంలో గుట్టను ముస్తాబు చేశారు. సమక్క, సారలమ్మ గద్దెలను అందంగా తీర్చిదిద్దారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేశారు. జాతరకు హాజరుకావాలని కోరుతూ స్థానిక శాసన సభ్యులు ప్రకాష్‌గౌడ్‌ను ఆహ్వానించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. గత నవంబర్‌లో మనాలిలోని అటల్‌బిహారీ వాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగిన నేషనల్ సర్వీస్ స్కీమ్-నేషనల్ అడ్వెంచర్ క్యాంప్‌లో వర్సిటీ పరిధిలోని ఎనిమిది కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కార పత్రాలను అందజేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాలరెడ్డి, సైఫాబాద్ కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీచల్లా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

మణికొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 3 నుంచి 6 సంవత్సరాల వయసు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించే క్రమంలో గండిపేట మండల అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసిందని శిక్షకురాలు పద్మజ తెలిపారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని సులభతరం చేసేందుకు ఆట, పాట ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు.

పాలిసెట్‌కి ప్రిపేర్ అవ్వండి ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్న జీఐఎల్‌టీ


మణికొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్

- జీహెచ్‌ఈఎల్-మెహిదీపట్నం వరకు 25 జెడ్పీహెచ్ఎస్‌లలో అవగాహన
- పాలిసెట్-2025కి నోడల్ ఏజెన్సీగా 'జీఐఎల్‌టీ'లో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు
- ఈ ఏడాది 1000 మంది దరఖాస్తు చేసుకొనేలా ఏర్పాట్లు

రాయదుర్గం: పాలిసెట్-2025పై పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టింది జీఐఎల్‌టీ. రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) ద్వారా అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాలిసెట్ పరీక్ష, దరఖాస్తు చేయడం, కోర్సులు, పాలిటెక్నిక్‌లో సీటు సాధన వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు జీఐఎల్‌టీలోని ఫ్యాకల్టీని గ్రూపులుగా ఏర్పాటు చేసి దశలవారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాలిటెక్నిక్ కోర్సులు, జీఐఎల్‌టీలో కోర్సులు పూర్తి చేసే వారికి 100 శాతం జాబ్ గ్యారెంటీ ఉంటుందని ,ఇవి పూర్తి చేసిన విద్యార్థులు దేశ, విదేశాలలో ప్రైవేటు, ప్రభుత్వ లెదర్ కంపెనీలలో పని చేయడం లేదా సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే స్థాయిలో ఉన్నారని వివరిస్తున్నారు.

జీఐఎల్‌టీలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

పాలిసెట్ నిర్వహణలో నోడల్ ఏజెన్సీగా జీఐఎల్‌టీ గుర్తింపు పొందింది. దీంతో పాలిసెట్‌పై అవగాహన కోసం రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశారు. పనివేళల్లో ఫ్యాకల్టీ, అధికారులు అందుబాటులో ఉంటారు. ఇందులో ప్రస్తుతం పదో తరగతి చదివే విద్యార్థులు వస్తే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయిస్తారు. అంతేకాకుండా పాలిటెక్నిక్, జీఐఎల్‌టీ కోర్సుల గురించి తెలియజేస్తారు. గత ఏడాది ఈ కేంద్రం ఏర్పాటు చేయగా 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది 1000 మంది దరఖాస్తు చేసుకొనేలా ఏర్పాట్లు చేయాలని సంకల్పించారు.

భెల్- మెహిదీపట్నం వరకు పాఠశాలల్లో అవగాహన

బీహెచ్‌ఈఎల్ నుంచి మెహిదీపట్నం వరకు ఉన్న 25 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటగా మణికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే తరహాలో మిగతా జెడ్పీహెచ్ఎస్‌లలో కూడా పదవ తరగతి చదివే విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ కుటుంబానికి త్వరితంగా ఆదాయం సమకూర్చే వ్యక్తులుగా విద్యార్థులు ఎదిగేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఏడాది చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు స్పందన బాగుండడంతో ఈ ఏడాది కూడా నిర్వహించనున్నారు.

ప్రతిఏటా అవగాహన కార్యక్రమాలు.. పాలిసెట్‌పై శిక్షణ



ప్రతియేటా జెడ్పీహెచ్ఎస్‌లలో పాలిసెట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాలిసెట్ ప్రవేశ పరీక్ష, రాసే విధానం పై కూడా ప్రత్యేక శిక్షణను రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.ఈ ఏడాది 1000 మంది పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయించాలని లక్ష్యం. జీఐఎల్‌టీ, పాలిటెక్నిక్‌తో ఉపాధి గ్యారంటీ. జీఐఎల్‌టీలోని మౌలిక వసతులు, ఉపకారవేతనాలు, హాస్టల్ సౌకర్యం, అత్యాధునిక ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, పలు సౌకర్యాలు ఉన్నాయి.

– ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్, జీఐఎల్‌టీ

ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. మంగళవారం అసెంబ్లీ భవనాల కమిటీ హాల్ నంబర్-1లో ప్రజాపద్దుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇబ్బంది కల్గకుండా కొండాపూర్ జిల్లా ఆస్పత్రి, బస్తీ దవాఖానాల నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. పీజీ సీట్ల పెంపు, ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడం, పని చేయని డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్, మానసిక ఆరోగ్య సంస్థలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రజాపద్దుల కమిటీ సభ్యులు భానుప్రసాదరావు, రేవూరీ ప్రకాష్‌రెడ్డి, అబ్దుల్లా బలాల, అకౌంటెంట్ జనరల్ మాధవి, అసెంబ్లీ లెజిస్లేచర్ డాక్టర్ వి.నర్సింహాచార్యులు, అరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినీ జెడ్ చోంగ్తు తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

- ఇంటి తాళం పగులగొట్టి ..
- రూ.2వేల నగదు, 3 తులాల వెండి ఆభరణాల చోరీ
- సీసీ కెమెరాల్లో దొంగలను గుర్తించిన పోలీసులు

మియాపూర్: ఇంటి తాళం పగులగొట్టి రూ.2 వేలు, మూడు తులాల వెండి ఎత్తుకెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న హర్ష ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్నాడు.ఆదివారం సెలవు కావడంతో ఇంటికి తాళం వేసి మీర్‌పేట్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు హర్ష ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దొంగలు పడ్డారని గ్రహించిన హర్ష మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి క్లూస్‌టీంతో చేరుకుని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా నలుగురు గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో కనిపించింది. దీంతో పోలీసులు ఇంటి యజమాని హర్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు.

వెసెల్లా ఉడ్స్‌లో ..

గచ్చిబౌలి: వెసెల్లా ఉడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో దొంగలు హల్‌చల్ చేశారు. సోమవారం రాత్రి 2 గంటల సమయంలో మదీనాగూడలోని నార్నే ఎస్టేట్‌లోని వెసెల్లా ఉడ్స్‌లో నలుగురు దొంగలు ప్రవేశించారు. వారి కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. మంగళవారం మియాపూర్ పోలీసులు వెసెల్లా ఉడ్స్‌లో సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని మియాపూర్ పోలీసులు తెలిపారు. మూడు రోజుల క్రితం మియాపూర్ పీఎస్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చోరీ జరిగింది. అక్కడ చోరీ చేసిన ముఠా, వెసెల్లాలో ప్రవేశించిన ముఠా ఒక్కటేనని పోలీసులు భావిస్తున్నారు. ఫెన్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా దొంగలు ఎలా లోపలకు వచ్చారని వెసెల్లా విల్లా యజమానులు వాపోతున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గచ్చిబౌలి: వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు యువతులను రెస్క్యూ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవేంద్ర కాలనీలోని గాట్ల రెసిడెన్సీ సర్వీస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 201లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో యాంటి హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్, గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇద్దరు యువతులను రెస్క్యూ హోంకు తరలించారు. సబ్ ఆర్గనైజర్లు దేబాషిష్, వెంకీ, వెంకన్న బాబు, విటులు అశోక్, రామోజ్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రధాన నిందితుడు విక్కీ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెరాయిన్ పట్టివేత.. ఇద్దరు అరెస్ట్


హెరాయిన్‌తో పట్టుబడ్డ నిందితులు

గచ్చిబౌలి: అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన 41 గ్రాముల హెరాయిన్‌ను శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నానక్‌రాంగూడ సుమధుర ఒలింపస్ లేబర్ కాలనీలో మంగళవారం దాడులు చేశారు. వెస్ట్ బెంగాల్, మాల్దా జిల్లాకు చెందిన అలీవుల్(27), నాసిముల్(27)ల వద్ద ఉన్న హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలీవుల్ వెస్ట్‌బెంగాల్‌లో గ్రాము హెరాయిన్ రూ.1500 కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. లేబర్ కాలనీలో గ్రాము రూ.5000 విక్రయించేందుకు నాసిముల్‌కు ఇచ్చాడు. దీంతో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హెరాయిన్ కొనుగోలుపై ఆరా తీస్తున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది ఫక్రుద్దీన్, మల్లేష్, నెహ్రూ, నిఖిల్, శేఖర్ తదితరులు ఉన్నారు.

సానుకూల అభ్యాస వాతావరణం నెలకొల్పాలి

రాయదుర్గం: ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా నిలవాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ శశీంద్రన్ సూచించారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ఉపాధ్యాయుల కోసం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సానుకూల అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనేలా ప్రశాంతంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రభంజనం


మణిదీప్-99.031


చరణ్‌తేజ్-98.295

రాయదుర్గం: జేఈఈ మెయిన్స్‌లో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాల నుంచి 104 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 13 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్స్ సాధించగా 25 మంది విద్యార్థులు 80కిపైగా, 20 మంది విద్యార్థులు 70 పర్సెంటైల్స్‌ను సాధించారు. రంగు మణిదీప్ 99 పర్సెంటైల్‌తో కళాశాలలో మొదటిస్థానంలో నిలవగా కొమ్ము చరణ్‌తేజ్ 98.295 పర్సెంటైల్స్‌తో ద్వితీయ స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె వెంకటచలపతి ,గురుకుల సంస్థ కార్యదర్శి అలుగువర్షిని, సంయుక్త కార్యదర్శి సంతోషి, ఓఎస్‌డీ వివేకానంద, రాష్ట్ర స్థాయి అధికారి ఎం భీమయ్య అభినందించారు.

రహదారులు, జంక్షన్ల విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి


రాడిసన్ జంక్షన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్లు, జంక్షన్ల విస్తరణను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ట్రిపుల్ ఐటీ, రాడిసన్ జంక్షన్ల అభివృద్ధి పనులు, శేరిలింగంపల్లి ఆర్‌ఓబీ అభివృద్ధి పనులను హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సిటీ పథకంలో భాగంగా ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణాల కోసం ఆస్తుల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాడిసన్ హోటల్ జంక్షన్‌ను ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేయాలని సూచించారు. అంతేకాకుండా శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూడళ్ల విస్తరణతో పాటు సుందరీకరణ పనులు చేపట్టి సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ప్రాజెక్ట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థం

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో రంగనాథుడి చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలోని బావి వరకు ఊరేగింపుగా వెళ్లి చక్రతీర్థ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూర్ణాహుతి, వసంతోత్సవం, ద్వాదశ ఆరాధన, దేవతావిసర్జనం , ధ్వజారోహణం, భేరిపూజ, మూకబలి, సప్తవర్ణ పూజలు చేశారు.అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా


గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్‌గా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు కాలనీవాసులు, బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆయనను మంగళవారం గోపన్‌పల్లిలోని కార్యాలయంలో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారి సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తున్నామన్నారు.

మలేషియా టౌన్‌షిప్ సమస్యలు పరిష్కరించండి


మలేషియా టౌన్‌షిప్‌వాసులతో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీలోని మలేషియా టౌన్‌షిప్‌లో పర్యటించారు. స్థానికులతో కలిసి టౌన్‌షిప్ పక్కన ఉన్న పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌వాసులు మాట్లాడుతూ పార్కులో వాకింగ్‌కు అనుమతించటం లేదని, పార్కుకి వెళ్లాలంటే 5 గంటల లెక్కన ఫీజు వసూలు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్కు ప్రభుత్వ స్థలమైనా, నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. టౌన్‌షిప్ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోందని, వీధి దీపాలు లేకపోవటంతో దొంగతనాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రమేష్ వెంటనే డీసీతో మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం బుధవారం మధ్యాహ్నం 1 గంటకు టౌన్‌షిప్ వాసులతో కలిసి జోనల్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలవనున్నట్లు బండి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, శివ చౌదరి, టౌన్‌షిప్ అసోసియేషన్ ప్రతినిధులు సాయి చౌదరి, రవివర్మ, కాకర్ల సురేష్, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి

పటాన్‌చెరు: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలు, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ... గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి బాల్యవివాహాలు చేయడం ద్వారా జరిగే అనర్థాలను వివరించడంతో పాటు పిల్లల అక్రమ రవాణా, పిల్లల దత్తత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల అక్రమ దత్తత వల్ల కలిగే నష్టాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అందే సేవలపై గ్రామాల్లో అవగాహన కల్పించారు .కార్యక్రమంలో సీడీపీఓ జయరాం, తహసీల్దార్ రంగారావు, డాక్టర్ కల్పన, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు , ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం క్యూ..

- మీ-సేవా కేంద్రాలకు పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు
- కిటకిటలాడిన బంజారాహిల్స్, ఖైరతాబాద్ సెంటర్లు
- అవసరమైన ధ్రువపత్రాలతో రావాలని అధికారుల సూచన


మీ-సేవా కేంద్రంలో రద్దీ

బంజారాహిల్స్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు మీ-సేవా కేంద్రాలకు క్యూ కట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని మీ-సేవా కేంద్రంతో పాటు ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయ ఆవరణలోని సెంటర్ల వద్ద ఉదయం నుంచే బారులుదీరారు. కొత్త కార్డుతో పాటు ప్రస్తుత కార్డులో కొత్తపేర్లు చేర్చాలని ఆధార్‌తో పాటు కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లును జతచేసి దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది సైతం అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బంజారాహిల్స్‌లోని మీ-సేవా కేంద్రానికి ఒక్కరోజే దాదాపు 1000 మంది వరకు, అలాగే బస్తీలు, కాలనీల్లోని మీ-సేవా కేంద్రాలకు కూడా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరికొద్ది రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిబ్బంది తెలిపారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్ నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలోని 81 రేషన్ షాపుల పరిధిలో కొత్తగా రేషన్ కార్డు కోసం మీ-సేవా కేంద్రాలకు వెళ్లి సదరు దరఖాస్తు ఫారానికి సంబంధిత డాక్యుమెంట్లు జత పరిచి ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

కొత్తవారికి ఈనెల రేషన్ లేనట్లే..

ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో గత నెల 6,093 మందిని అర్హులుగా గుర్తించి సర్వే చేయగా ఇందులో 2,938 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో నూతన లబ్ధిదారులకు ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. ఈనెల కూడా వారికి రేషన్ లేనట్లేనని తెలుస్తోంది.

సర్కిల్-7 పరిధిలో 83,013 రేషన్‌కార్డులు..

ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలో 81 రేషన్ షాపులు ఉండగా ప్రస్తుతం వీటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 79,531, అంత్యోదయ అన్నయోజన కార్డులు 3481, ఒక అన్నపూర్ణ కార్డు కలిపి మొత్తం 83,013 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 2,92,882 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు.